
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి

పెద్దపల్లి
జిల్లా వార్తలు
5★
బుధవారం 27 మార్చి 2024

రైతులను నమ్మించి మోసం చేసిన కాంగ్రెస్
సాగునీరు విడుదల చేయాలని రైతుల రాస్తారోకో
8లో..





కాంగ్రెస్‌లోకి కార్మిక నేతలు

- ముమ్మరంగా వెంకట్రావ్, మల్లయ్యల ప్రయత్నాలు
- పార్లమెంట్ ఎన్నికల ముందు కోల్‌బెల్ట్‌లో రాజకీయ మార్పులు

గోదావరిఖని, మార్చి 26: రాష్ట్రంలో ప్రభుత్వం మారిన తర్వాత జరుగుతున్న రాజకీయ పరిణామాలు సింగరేణి దాకా వచ్చాయి. సింగరేణి కార్మికోద్యమంలో మూడు, నాలుగు దశాబ్దాలుగా ప్రముఖ నాయకులుగా, సంఘాలను నడిపిన చరిత్ర కలిగిన ఆ ఇద్దరు అధికార పార్టీ కాంగ్రెస్ గూటికి చేరేందుకు ప్రయత్నిస్తున్నారు. పార్లమెంట్ ఎన్నికల ముందు ఈ నేతలు కాంగ్రెస్‌లో చేరేందుకు రంగం సిద్ధమయ్యింది. ఇందులో తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘం మాజీ అధ్యక్షుడు బీ వెంకట్రావ్, సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు, మాజీ వర్కింగ్ ప్రెసిడెంట్ కే మల్లయ్యలు ఉన్నారు. అసెంబ్లీ ఎన్నికల ఫలితాల వెంటనే వెంకట్రావ్ కాంగ్రెస్ గూటికి చేరేందుకు ప్రయత్నించినప్పటికీ అది సాధ్యం కాలేదు. అప్పటికి కాంగ్రెస్ పార్టీ రాజకీయ నాయకుల చేరికలకు తలుపులు తెరవలేదు. ఇప్పుడు చేరికల ప్రక్రియ ముమ్మరం కావడంతో వెంకట్రావ్ చేరిక కూడా ఖాయమైనట్టు తెలిసింది. సింగరేణి ప్రాంతంలో అసెంబ్లీ ఎన్నికల్లో స్వీప్ చేసిన కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ ఎన్నికల్లో కూడా కోల్‌బెల్ట్ ప్రాంత పార్లమెంట్ స్థానాలను కైవసం చేసుకునేందుకు ప్రయత్నం చేస్తున్నది. ఈ సందర్భంలో కాంగ్రెస్ పార్టీకి సమీకరణల అవసరం ఉన్నది. ఈ సందర్భంలో వెంకట్రావ్ చేరిక దాదాపు ఖరారు అయ్యింది. కాంగ్రెస్‌లోనే పుట్టి ఎమ్మెల్సీగా ఎదిగి సింగరేణి కోల్‌మైన్స్ లేబర్ యూనియన్(ఐఎన్‌టీయూసీ)కి 30ఏళ్ల పాటు అధ్యక్షునిగా పనిచేసి సంఘాన్ని గుర్తింపులోకి తీసుకురావడంలో కీలక భూమిక పోషించిన వెంకట్రావ్ సంజీవరెడ్డి తర్వాత రాష్ట్రంలో ఐఎన్‌టీయూసీకి ఆయనే పెద్ద దిక్కుగా మారారు. 2014లో టీబీజీకేఎస్ గుర్తింపులోకి వచ్చింది. బీఆర్ఎస్ ప్రభుత్వం కూడా ఏర్పడింది. అప్పటికి వెంకట్రావ్ కాంగ్రెస్ ఎమ్మెల్సీగా ఉన్నారు. ఆ సందర్భంలో అనూహ్యంగా వెంకట్రావ్ 2016ఆగస్టులో బీఆర్ఎస్‌లో చేరారు. వెంకట్రావ్ చేరికకు సామాజికవర్గ నేపథ్యమే ప్రధాన భూమికగా చెప్పుకున్నారు. అప్పుడు టీబీజీకేఎస్ అంతర్గత సంక్షోభంలో ఉన్నది. అప్పటివరకు టీబీజీకేఎస్ అధ్యక్షుడిగా ఉన్న ఆకునూరి కనకరాజును తొలగించి బీఆర్ఎస్‌లో చేరిన వెంకట్రావ్‌ను తక్షణమే అధ్యక్షుడిగా చేశారు. 2023వరకు సింగరేణిలో టీబీజీకేఎస్ గుర్తింపు సంఘంగానే ఉన్నది. 2023లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించడంతో గుర్తింపు సంఘం ఎన్నికల ముందు వెంకట్రావ్ టీబీజీకేఎస్ అధ్యక్ష పదవికి రాజీనామా చేశారు. అప్పటినుంచి స్తబ్ధంగా ఉన్న వెంకట్రావ్ కాంగ్రెస్‌లో చేరేందుకు ప్రయత్నిస్తున్నారు. వెంకట్రావ్‌కు కాంగ్రెస్ మాతృ సంస్థే కనుక ఆయన కొత్తగా చానల్ పట్టుకుని వెళ్లాల్సిన అవసరం లేదు. వెంకటస్వామి కుటుంబంతో పాటు మంత్రి శ్రీధర్ బాబు, సీనియర్ కాంగ్రెస్ నాయకులందరితో సంబంధాలు ఉన్న వెంకట్రావ్ చేరిక నామమాత్రం కానున్నది. టీబీజీకేఎస్‌కు వెంకట్రావ్ చేసిన రాజీనామా నిన్న మొన్నటి వరకు ఆమోదం పొందలేదు. కానీ రెండు రోజుల క్రితం గోదావరిఖనిలో టీబీజీకేఎస్ కేంద్ర వర్కింగ్ కమిటీ సమావేశంలో వెంకట్రావ్, కే మల్లయ్య రాజీనామాలను ఆమోదించింది.

● ఊహాగానాలకు బలం..

తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమం వైపు సింగరేణి కార్మికులను మళ్లించడంలో కే మల్లయ్య కీలక భూమిక పోషించారు. టీబీజీకేఎస్‌ను ఏర్పాటు చేయడంలో ఆయనే ముఖ్యుడు. అప్పటినుంచి టీబీజీకేఎస్ గుర్తింపులోకి వచ్చే వరకు పని చేసిన కే మల్లయ్య గుర్తింపులోకి వచ్చిన తరువాత అంతర్గత విభేదాలతో 2014లో టీబీజీకేఎస్‌కు దూరమయ్యారు. ఆ తరువాత బీఎంఎస్‌లోకి వెళ్లారు. బీఎంఎస్‌కు సింగరేణిలో నాయకత్వం వహించారు. కానీ విప్లవ, వామపక్ష ఉద్యమాల నుంచి ఎదిగిన మల్లయ్య బీఎంఎస్‌లో ఇమడలేకపోయారు. కేటీఆర్ పిలిచి పార్టీలో, యూనియన్‌లో సముచిత స్థానం కల్పిస్తామని హామీ ఇవ్వడంతో మల్లయ్య తిరిగి బీఆర్ఎస్‌లో చేరారు. టీబీజీకేఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మల్లయ్యకు హోదా కల్పించారు. అయితే కే మల్లయ్య కూడా గుర్తింపు సంఘం ఎన్నికల్లో గౌరవ అధ్యక్షురాలు కవిత కార్యాచరణపై అసంతృప్తి వ్యక్తం చేశారు. అప్పుడే వెంకట్రావ్, మల్లయ్య, రాజిరెడ్డి యూనియన్ పదవులకు రాజీనామా చేశారు. అప్పటి నుంచి మల్లయ్య టీబీజీకేఎస్‌కు దూరంగా ఉంటూ వచ్చారు. ఈమధ్య గోదావరిఖనిలో జరిగిన టీబీజీకేఎస్ వర్కింగ్ కమిటీ సమావేశానికి కూడా టీబీజీకేఎస్ వర్గాలు మల్లయ్యను సాదరంగా ఆహ్వానించాయి. కానీ మల్లయ్య సమావేశానికి దూరంగా ఉండి పోవడంతో ఆయన కూడా కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారనే ఊహాగానాలకు బలం చేకూర్చాయి. టీబీజీకేఎస్ వర్కింగ్ కమిటీ సమావేశంలో కే మల్లయ్య రాజీనామాను కూడా ఆమోదించారు. ఇదిలా ఉండగా కొంత కాలంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ద్వారా కాంగ్రెస్ పార్టీలోకి కే మల్లయ్య వెళ్లేందుకు ప్రయత్నం చేస్తున్నట్లు సమాచారం. గతంలో పొంగులేటి బీఆర్ఎస్‌లో పనిచేస్తున్న సమయంలో టీబీజీకేఎస్ వ్యవహారాలను కూడా ఖమ్మం ప్రాంతంలో చక్కబెట్టారు. అప్పటినుంచి శ్రీనివాస్‌రెడ్డితో మల్లయ్యకు దగ్గరి సంబంధా లున్నాయి. ఇంతకాలం వేచి చూసిన ఈ కార్మిక నాయకులు, అటు కాంగ్రెస్ పార్టీ, ఇప్పుడు పార్లమెంట్ ఎన్నికల సందర్భంలో వీరిని పార్టీలోకి తీసుకునేందుకు సానుకూలత వ్యక్తం చేసినట్టు తెలిసింది. మల్లయ్య కాంగ్రెస్ పార్టీకి మాత్రమే పరిమితమయ్యే అవకాశాలున్నట్టు ఆయన అనుచరులు చెబుతున్నారు. అయితే వెంకట్రావ్ మాత్రం ఐఎన్‌టీయూసీ నాయకత్వాన్ని తిరిగి కోరే అవకాశం ఉన్నట్టు తెలుస్తున్నది. ఇంతకాలంగా టీబీజీకేఎస్‌కు నాయకత్వం వహిస్తూ ఐఎన్‌టీయూసీకి నష్టం చేసిన వెంకట్రావ్‌ను సదరు యూనియన్ వర్గాలు ఆమోదిస్తాయా లేదా అనేది ప్రశ్నార్థకమే. ఏది ఏమైనా పార్లమెంట్ ఎన్నికల ముందు సింగరేణిలోని ఈ ప్రముఖ కార్మిక నేతలు కాంగ్రెస్‌లో చేరడం మాత్రం చర్చనీయాంశమే. టీబీజీకేఎస్‌కు సంబంధించిన ఈ నాయకులిద్దరూ తిరిగి కాంగ్రెస్‌లో చేరడంతో సింగరేణి ప్రాంతంలో బీఆర్ఎస్‌కు నష్టం కలిగే పరిణామంగా చెప్పుకోవచ్చు.

పోలింగ్ సిబ్బంది మొదటి దశ ర్యాండమైజేషన్ పూర్తి

- కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

పెద్దపల్లి, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు జిల్లాలో పోలింగ్ సిబ్బంది మొదటి దశ ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి చేసినట్లు కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఆయన అదనపుకలెక్టర్ జే అరుణశ్రీతో కలిసి పోలింగ్ సిబ్బంది మొదటి దశ ర్యాండమైజేషన్ ప్రక్రియను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని పెద్దపల్లి అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలో 290 పోలింగ్ కేంద్రాలు, రామగుండం అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలో 260 పోలింగ్ కేంద్రాలు, మంథని అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలో 160 పోలింగ్ కేంద్రాలు, ధర్మపురి అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలో ధర్మారానికి సంబంధించి 53పోలింగ్ కేంద్రాలు మొత్తం 763 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, వీటికి ప్రిసైడింగ్, సహాయప్రిసైడింగ్ అధికారి, ఓపీవోలను కేటాయించామన్నారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలు ప్రకారం 20శాతం అదనంగా సిబ్బంది కేటాయింపు ప్రక్రియ చేపట్టామని తెలిపారు. జిల్లాలో మొత్తం 916 మంది ప్రిసైడింగ్ అధికా రులు, 916మంది సహాయక ప్రిసైడింగ్ అధికారులు, 1832మంది ఓపీవోలకు సంబంధించి పారదర్శకంగా ఎన్ఐసీ హైదరాబాద్ రూపొందించిన సాఫ్ట్‌వేర్ వినియోగిస్తూ ఆన్‌లైన్ మొదటి దశ ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తిచేశామని తెలిపారు. కార్యక్రమంలో పెద్దపల్లి ఆర్డీవో బి గంగయ్య, డీఈవో డి మాధవి తదితరులు పాల్గొన్నారు.

కౌంటింగ్ కేంద్రంలో ఏర్పాట్ల పరిశీలన



ఏర్పాట్లను పరిశీలిస్తున్న పోలీస్, రెవెన్యూ అధికారులు

రామగిరి, మార్చి 26: రాబోయే పార్లమెంట్ ఎన్నికల కౌంటింగ్ కేంద్రం ఏర్పాట్లపై పోలీసులు, రెవెన్యూ ఉన్నతాధికారులు కసరత్తు చేస్తున్నారు. అందులో భాగంగా మంగళవారం మంథని జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాలను పెద్దపల్లి అడిషనల్ డీసీపీ రాజు, రెవెన్యూ డివిజన్ అధికారి హనుమానాయక్, తహసీల్దార్‌లు రాంచందర్‌రావు, రాజయ్య, డీఐ విజయ్‌శంకర్‌లు పరిశీంచారు. కళాశాలలోని కౌంటింగ్ ప్రక్రియ కోసం ఏర్పాటు చేసే గదులతో పాటు ఎన్నికల బ్యాలెట్ బాక్స్‌లను భద్రపరిచే గదులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎస్ఐ సందీప్‌కుమార్, ఆర్ఐ రాజాబాబు, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

లైసెన్స్ కలిగిన తుపాకులను సరెండర్ చేయాలి

- రామగుండం సీపీ శ్రీనివాస్

కోల్‌సిటీ, మార్చి 26: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో రామగుండం కమిషరేట్ పరిధిలోని లైసెన్స్ కలిగిన తుపాకులను వెంటనే సరెండర్ చేయాలని రామగుండం పోలీస్ కమిషనర్ ఎం శ్రీనివాస్ ఆదేశాలు జారీ చేశారు. పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో ఆయుధాల చట్టం 1959 సెక్షన్ 21 ప్రకారం కమిషనరేట్ పరిధిలో నివసిస్తూ లైసెన్స్ తుపాకులు కలిగి ఉన్నవారంతా తమ సమీపంలోని పోలీస్ స్టేషన్‌లో తుపాకులను డిపాజిట్ చేయాలని, ఎన్నికల నేపథ్యంలో ఎలాంటి హింసాత్మక ఘటనలు చోటు చేసుకోకుండా ఆయుధాలను ముందస్తుగా డిపాజిట్ చేయాలని, అలా చేయని వారిపై కేసులు పెడతామన్నారు. ఎన్నికల ప్రక్రియ ముగిసిన తరువాత జూన్ 7న తిరిగి తుపాకులను తీసుకోవచ్చని సూచించారు. జాతీయ బ్యాంకులు, ప్రభుత్వరంగ సంస్థల్లో పని చేసే భద్రత సిబ్బందికి, గార్డు డ్యూటీలో ఉన్నవారికి మినహాయింపు ఉంటుందని పేర్కొన్నారు.

'స్థానికేతరులను గెలిపించవద్దు..'

ఓదెల, మార్చి 26 : పెద్దపల్లి నియోజకవర్గం వలస నాయకులకు అడ్డా అయిందని, నియోజకవర్గంతో సంబంధం లేని వారికి ఓట్లు వేయవద్దని ఓయూ ప్రొఫెసర్ వాసర్ల నతానియల్ కోరారు. మంగళవారంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ నియోజకవర్గంలో కళాశాలలు తక్కువగా ఉన్నాయని, దీంతో ఉన్నత విద్య కోసం విద్యార్థులంతా పట్టణాలకు తరలివెళుతుంటే గతం నుంచి ఉన్న ఎంపీలు ఏమాత్రం పట్టించుకోలేదన్నారు. ఇక్కడ కనీసం విశ్వ విద్యాలయం లేదని, దీని కారణంగా నిరుద్యోగులుగా ఉన్న విద్యావంతులంతా ఉపాధ్యాయ, అధ్యాపక అవకాశాలు కోల్పోతున్నారని, నియోజకవర్గ కేంద్రంలో నర్సింగ్, మెడికల్ కళాశాలలు లేవని, విద్యా, వైద్య, సాంకేతిక, ఫార్మసీ కళాశాలలు స్థాపించాల్సిన అవసరం ఉందని తెలిపారు. అధిక సంఖ్యలో గ్రంథాలయాలు స్థాపించి విద్యార్థులు, యువతను ప్రోత్సహించి పోటీ పరీక్షలకు సిద్ధం చేయాల్సిన అవసరం ఉందన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ఎంపీగా పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్నానని తెలిపారు.

ఇసుక అక్రమ రవాణా నియంత్రణకు కంట్రోల్ రూం

- కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

పెద్దపల్లి, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇసుక అక్రమ రవాణాకు కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని, దీనిపై ఎవరు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. మంగళవారం ఆయన కలెక్టరేట్‌లో ఇసుక రవాణాపై స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే అరుణశ్రీతో కలిసి సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 26 సాండ్ రీచ్‌లు ఉన్నాయని, వాటిలో ప్రస్తుతం 18 రీచ్‌లు నడుస్తున్నాయని, స్థానిక అవసరాలకు, ప్రభుత్వ పనులకు ఇసుక కేటాయింపు చేసిన తర్వాత మిగిలిన ఇసుక రీచ్‌లను టీఎస్ఎండీసీ కేటాయించామన్నారు. జిల్లాలో అక్రమ ఇసుక రవాణా నియంత్రణ కోసం త్వరలో కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలో సాయంత్రం 6 గంటలు దాటిన తర్వాత ఎటువంటి ఇసుక రవాణాకు అనుమతి లేదని, 6 గంటల తరువాత అక్రమ ఇసుక రవాణా జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. స్థానిక అవసరాలకు అవసరమైన మేర ఇసుకను గ్రామస్తులు తీసుకొనేందుకు పంచాయతీ కార్యదర్శి అనుమతిస్తారని, 3 క్యూబిక్ మీటర్ల మేర ఇసుక పట్టే ట్రాక్టర్‌లో మాత్రమే స్థానిక అవసరాలకు ఇసుక తరలింపు వినియోగించాలని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో జరిగే ప్రభుత్వ నిర్మాణాలకు అవసరమైన ఇసుకను ఆర్డీవో, తహసీల్దార్ల పర్యవేక్షణలో తరలించాలని అన్నారు. టీఎస్ఎండీసీ కేటాయించిన ఇసుక రీచ్‌ల నుంచి నిబంధనల ప్రకారం మాత్రమే ఇసుక తరలింపు జరిగే విధంగా పక్కా పర్యవేక్షణ ఉండాలని కలెక్టర్ అన్నారు. ఇసుక రీచ్‌ల వద్ద ఎన్ని మీటర్ల లోతు ఇసుక తవ్వుతున్నారు పరిశీలించాలన్నారు. చెక్‌డ్యామ్‌లకు 500 మీటర్ల సమీపంలో ఇసుక తరలింపు లేకుండా చూడాలని అన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఓవర్ లోడ్‌తో వెళ్లే వాహనాలను వెంటనే సీజ్ చేసి, సంబంధిత డ్రైవర్ లైసెన్స్ రద్దు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో ఇసుక వాహనాలు రవాణా జరిగే ఐదు, ఆరు ముఖ్యమైన ప్రాంతాలను గుర్తించి అక్కడ పర్యవేక్షణ చేయాలన్నారు. ప్రతి రోజు వివిధ సమయాలలో ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తూ నిబంధనలు పాటించని వాహనాలు, బ్లాక్ లిస్టు చేసిన వాహనాలలో ఇసుక తరలింపు వంటి వాటిని పరిశీలించి కట్టడి చేయాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు.

ఈ సమావేశంలో ఆర్డీవో బి గంగయ్య, డీపీవో ఆశాలత, మైనింగ్ కార్యాలయ సిబ్బంది, పలువురు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాలి

- అదనపు కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్



విద్యార్థులను పరిచయం చేసుకుంటున్న అదనపు కలెకర్

జ్యోతినగర్, మార్చి 26: ప్రతి విద్యార్థి చదువుతో పాటు క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాలని అదనపు కలెక్టర్ శ్యాంప్రసాద్ పేర్కొన్నారు. మంగళవారం ఎన్‌టీపీసీ ఆధ్వర్యంలో స్థానిక మహాత్మాగాంధీ స్టేడియంలో గ్రామీణ ఆటల పోటీలను ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కేదార్ రంజన్ పాండుతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడారు. గ్రామీణ క్రీడాకారులను ఎన్‌టీపీసీ ప్రోత్సహించడం అభినందనీయమని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థుల సంక్షేమం కోసం ఎన్‌టీపీసీ కృషి చేస్తున్నదని పేర్కొన్నారు. ప్రతి విద్యార్థి ఏదైనా క్రీడలో నైపుణ్యం సాధించేలా సాధన చేయాలని సూచించారు. ఈసందర్భంగా ప్రాజెక్టు ఈడీ కేదార్ రంజన్‌పాండు మాట్లాడారు. సీఎస్ఆర్ నిధులతో ప్రాజెక్టు ప్రభావిత గ్రామాల అభివృద్ధికి తోడ్పాటు అందించడంతో పాటు ఆయా గ్రామాల విద్యార్థులు విద్యలో క్రీడల్లో రాణించేలా అవసరమైన సహాయసహకారాలను అందిస్తున్నట్టు తెలిపారు. అనంతరం విద్యార్థులను పరిచయం చేసుకుని పోటీలను ప్రారంభించారు. 20 ప్రభుత్వ పాఠశాలల నుంచి 600 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రామగుండం తహసీల్దార్ కుమారస్వామి, ఎంఈఓ సంపత్‌రావు, ఎన్‌టీపీసీ జీఎం ప్రశాంత్‌తో పాటు అధికారులు పాల్గొన్నారు.

మద్దతు ధరకు ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

- కొనుగోలు కేంద్రాల వద్ద ఇబ్బందులు తలెత్తకుండా చూడాలి

- రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి

పెద్దపల్లి, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత యాసంగి సీజన్‌లో రైతులు పండించిన ధాన్యాన్ని చివరి గింజ వరకు మద్దతు ధరలకు కొనుగోలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆమె అన్ని జిల్లాల కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతూ యాసంగి పంట కోతలకు వస్తున్న నేపథ్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 7149 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని, కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా అన్ని వసతులు కల్పించాలన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద ప్యాడి క్లీనర్లు, తేమ యంత్రాలు, తూకం వేసే యంత్రాలు, టార్పాలిన్లు, గన్ని బ్యాగులు సన్నద్ధం చేసుకోవాలని, ధాన్యం కొనుగోలు కేంద్రాల ఇంచార్జిలు, సిబ్బందికి అవసరమైన శిక్షణ అందించాలని, కొనుగోలు చేసిన ధాన్యాన్ని సకాలంలో రైస్ మిల్లులకు రవాణా చేసేందుకు అవసరమైన వాహనాలు సిద్ధం చేసుకోవాలని అన్నారు. ఎఫ్‌సీఐ నిర్దేశించిన ధాన్యం నాణ్యతప్రమాణాలు, తేమ శాతంపై విస్తృత అవగాహన కల్పించాలన్నారు. సకాలంలో ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల నుంచి సంబంధిత మిల్లర్లకు కేటాయించాలని, మిల్లర్లు ధాన్యంలో కోతలు విధించకుండా చర్యలు తీసుకోవాలన్నారు. గడిచిన వానాకాలానికి సంబంధించి సీఎంఆర్ రారైస్ డెలివరీ వేగవంతం చేయాలన్నారు. వేసవి కాలంలో తాగునీటి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ జిల్లాలో 3 లక్షల 4 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసేందుకు 305 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని, ఏప్రిల్ 1నుంచి ఏప్రిల్ 10వరకు దశల వారీగా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించేందుకు ప్రణాళిక తయారు చేసుకున్నామని తెలిపారు. ఈ కాన్ఫరెన్స్‌లో డీఎస్‌వో ప్రేమ్‌కుమార్, డీసీవో శ్రీమాల, డీఆర్‌డీవో రవీందర్, డీఏవో ఆదిరెడ్డి, జడ్పీ సీఈవో నరేందర్, డీఎంవో ప్రవీణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మధ్యమానేరులో మట్టి నింపడంపై పోలీసులకు ఫిర్యాదు

తంగళ్లపల్లి, మార్చి 26: నిబంధనలకు విరుద్ధంగా మధ్య మానేరు ప్రాజెక్టులో మట్టి నింపిన ప్రతిమ కన్‌స్ట్రక్షన్స్ చైర్మన్‌పై తంగళ్లపల్లి పోలీస్ స్టేషన్‌లో రిటైర్డ్ సీఐ దాసరి భూమయ్య ఫిర్యాదు చేశారు. పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో తంగళ్లపల్లి మండలం చీర్లవంచ శివారులో మధ్య మానేరు నుండి అంతగిరి రిజర్వాయర్‌కు నీటిని తరలించేందుకు అదనపు కాలువ నిర్మాణం చేపట్టారు. కాల్వ పనులు నిర్వహించిన ప్రతిమ కన్‌స్ట్రక్షన్ నిబంధనలకు విరుద్ధంగా కాలువ నిర్మాణంలో తోడిన మట్టిని మధ్య మానేరులో డంపు చేశారు. దీంతో మధ్య మానేరులో నీటి నిల్వ సామర్థ్యం తగ్గిపోయి రైతులకు నష్టం వాటిల్లుతుందని పేర్కొన్నారు. నిబంధనలకు విరుద్ధంగా మట్టిని డంపు చేసిన ప్రతిమ కన్‌స్ట్రక్షన్స్ చైర్మన్‌పై చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో రిటైర్డ్ సీఐ దాసరి భూమయ్య పేర్కొన్నారు.

దాడిలో గాయపడ్డ వివాహిత మృతి


మేడిశెట్టి రమ

జగిత్యాలరూరల్, మార్చి 26 : కూతురిని తనకిచ్చి పెళ్లి చేయలేదన్న కోపంతో ఓ యువకుడు వివాహితపై దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డ మహిళ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది. జగిత్యాల రూరల్ ఎస్సై సధాకర్ తెలిపిన వివరాల ప్రకారం జగిత్యాల మండలం తిప్పన్నపేట గ్రామానికి చెందిన మేడిశెట్టి రమ (40) అనే మహిళకు కొడుకు రిషి, కూతురు వాణి ఉన్నారు. భర్త సురేష్ ఉపాధి నిమిత్తం గల్ఫ్ వెళ్లాడు. దీంతో రమ స్వగ్రామమైన తిప్పన్నపేటలో నివాసం ఉంటోంది. అదే గ్రామానికి చెందిన బోగు ప్రకాశ్ రమ కూతురు వాణిని పెళ్లి చేసుకుంటానని కొన్ని రోజుల నుంచి వెంటపడుతున్నాడు. దీనికి రమతో పాటు కుమారుడు నిరాకరించారు. ఇదే విషయమై పలుమార్లు వీరి మధ్య గొడవలు జరిగాయి. వాణితో తనకు పెళ్లి కాకుండా అడ్డు పడుతోందనే కారణంగా రమపై ప్రకాశ్ కోపం పెంచుకున్నాడు. రమను చంపేస్తే తన పెళ్లికి ఎవరూ అడ్డుపడరని భావించాడు. సోమవారం తిప్పన్నపేటలో జరిగిన హోలీ వేడుకల్లో బా గంగా రమతో పాటు ఆమె కొడుకుతో గొడవ పడ్డారు. ప్రకాశ్ కొడవలితో రమ గొంతుపై దాడిచేశాడు. తీవ్రంగా గాయపడ్డ ఆమెను కరీం నగర్‌లోని ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందింది. రమ కుమారుడు రిషి ఫిర్యాదు మేరకు బోగు ప్రకాశ్‌పై హత్య కేసు నమోదుచేసినట్లు జగిత్యాల రూరల్ ఎస్సై సధాకర్ తెలిపారు.

పోలీస్‌స్టేషన్‌లో పూజలందుకున్న నారసింహుడు

● ధర్మపురిలో ఘనంగా శ్రీ లక్ష్మీ నృసింహస్వామి దక్షిణ దిగ్యాత్ర ● పాల్గొన్న జగిత్యాల డీఎస్పీ, సీఐ, ఎస్‌ఐలు

ధర్మపురి, మార్చి 26: ధర్మపురి క్షేత్రంలో జరిగే బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీ లక్ష్మీ నృసింహస్వామి దక్షిణ దిగ్యాత్ర కార్యక్రమాన్ని మంగళవారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా కళ్యాణం, తెప్ప, డోలోత్సవాల అనంతరం స్వామి వారలు దక్షిణం వైపు విహార యాత్రకు బయలుదేరే కార్యక్రమాన్ని దక్షిణ దిగ్యాత్రగా చెబుతుంటారు. ఈ దిగ్యాత్రలో భాగంగా శ్రీ లక్ష్మీ నృసింహ స్వామి (యోగ, ఉగ్ర) వారల ఉత్సవ మూర్తులను ఆలయం నుంచి బయటకు తీసుకవచ్చారు. అనంతరం సేవలపై ఉంచి మంగళ వాయిద్యాలు వెంట రాగా, రిటైర్డ్ ఏఎస్‌ఐ కమటం మల్లయ్య, వివిధ రకాల వేషాధారణ, చిన్నారుల నృత్యాలు, బొప్పనపెల్లి ఐలయ్య ఒగ్గు డోలు ప్రదర్శనతో సాయంత్రం వేళలో దక్షిణ దిశలో గల పోలీస్ స్టేషన్ వైపు తీసుక వెళ్లారు. దారి పొడవుగా పోలీస్ సిబ్బంది ఆనందోత్సహాల మధ్య నృత్యాలు చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ గేటు ఎదుట పోలీస్ కుటుంబ సభ్యులు, పలువురు మహిళలు మంగళ హారతులతో స్వాగతం పలికి స్వామి వారల సేవలను పోలీస్‌స్టేషన్‌లోకి ఆహ్వానించారు. జగిత్యాల, డీఎస్పీ రఘుచందర్ ధర్మపురి సీఐ రాంనర్సింహరెడ్డి, ఎస్‌బీ సీఐ నాగేశ్వర్‌రావు, ఎస్‌ఐలు ఉదయ్‌కుమార్, శ్రీధర్‌రెడ్డి, సతీష్, ఉమాసాగర్, పోలీస్ సిబ్బంది స్వామి వారల సేవలను భుజాలపైకి ఎత్తుకుని మోసి లోనికి ప్రవేశించారు. స్వామివారల సేవలను పోలీస్ స్టేషన్ ఆవరణలో అందంగా పూలతో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదిక వద్ద ఉంచారు. ఆలయ వేద పండితులు బొజ్జ రమేష్ శర్మ తదితర వేద బ్రాహ్మణుల మంత్రోచ్ఛ రణల మధ్య యజ్ఞాచార్యులు కందాళై పురుషోత్తమాచార్యులు అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పోలీస్



పోలీస్‌స్టేషన్‌లోకి ప్రవేశిస్తున్న స్వామివారి సేవలను భుజాలపై మోస్తున్న ధర్మపురి సీఐ, ఎస్‌ఐ, పోలీస్ అధికారులు



బ్రహ్మపుష్కరిణిలో శ్రీ వేంకటేశ్వరుని తెప్పోత్సవం

అధికారులు తమ ఆయుధాలు స్వామి వారి సేవల పక్కన ఉంచి పూజలు నిర్వహిండం అనాదిగా వస్తుంది. అనంతరం వేద పండితులు, అర్చకులను పోలీస్ శాఖ పక్షాన శాలువాలు కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ఉత్సవ కమిటీ చైర్మన్ జక్కు రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీ వేంకటేశ్వరుని డోలోత్సవం

ధర్మపురి శ్రీ వేంకటేశ్వర స్వామి తెప్పోత్సవం, డోలోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. ఆలయ వేద పండితులు బొజ్జ రమేష్ శర్మ తదితర వేద బ్రాహ్మణుల మంత్రోచ్చరణల మధ్య మధ్యాహ్నం ఉత్సవ మూర్తిని సేవలపై ఆశీనులు చేశారు. అనంతరం పురవీధుల గుండా బ్రహ్మ పుష్కరిణి (కోనేరు)కు తీసుకువచ్చారు. బ్రహ్మ పుష్కరిణిలో హంస వాహనపైన ఉంచిన స్వామి వారల సేవలను ఐదు సార్లు ప్రదక్షిణలు చేయించి అర్చకులు తెప్పోత్సవం జరిపారు. అనంతరం బ్రహ్మ పుష్కరిణి మధ్య గల మండపంలోని ఊయలపై ఆశీనులు చేసి అర్చకులు డోలోత్సవం జరిపారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఈవో సంకటాల శ్రీనివాస్, ఉత్సవ కమిటీ చైర్మన్ జక్కు రవీందర్ పాల్గొన్నారు.

రాజన్న హుండీ ఆదాయం రూ.2 కోట్ల 21 లక్షలు

వేములవాడ, మార్చి 26 : వేములవాడ రాజరాజేశ్వర స్వామివారి దేవస్థానం ఖజానాకు హుండీ ద్వారా రూ.2 కోట్ల 21 లక్షలకుపై ఆదాయం సమకూరింది. 21 రోజుల వ్యవధిలో భక్తులు స్వామవారి హుండీల్లో సమర్పించిన కానుకలను మంగళవారం ఆలయ ఓపెన్ స్లాబ్ ప్రాంగణంలో లెక్కించారు. ఈ సందర్భంగా 2 కోట్ల 21 లక్షల 29 వేల 350 రూపాయల నగదు, 463 గ్రాముల బంగారం, 19 కిలోల 800 గ్రాముల వెండి లభించినట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఆలయ ఈవో కృష్ణప్రసాద్ నేతృత్వంలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నగదు పట్టివేత

గంభీరావుపేట, మార్చి 26: గంభీరావుపేట మండలం పెద్దమ్మ చెక్ పోస్ట్ వద్ద ఎలాంటి ఆధారాలు లేకుండా తరళిస్తున్న 1.52లక్షల నగదును మంగళవారం పోలీస్‌లు పట్టుకున్నారు. సిరిసిల్లకు చెందిన సతీష్ అనే వ్యక్తి ఎలాంటి ఆధారాలు లేకుండా తీసుకెళుతున్న రూ.92 వేల నగదును, గోరంటాలకు చెందిన సత్తవ్వ ఆధారాలు లేకుండా రూ.60 వేల నగదును తీసుకెళుతుండగా పట్టుకున్నట్టు ఎస్‌ఐ రాంమోహన్ తెలిపారు. నగదును సీజ్ చేసి, ఎన్నికల సెల్ రిటర్నింగ్ అధికారికి అప్పగించినట్టు ఎస్‌ఐ రాంమోహన్ వెల్లడించారు.

మల్యాల : ఆధారాలు లేకుండా తీసుకెళుతున్న నగదును కొండగట్టు బస్టాండ్ వద్ద పోలీసులు పట్టుకున్నారు. నిర్మల్ జిల్లా లోకేశ్వరం మండలం పుస్పూర్ గ్రామానికి చెందిన నిమ్మ శివన్న అనే వ్యక్తి కరీంనగర్ నుంచి ఎర్టీగా వాహనంలో లోకేశ్వరంకు రూ.54,500 తీసుకెళ్తుండగా వాహనాల తనిఖీలో పట్టుబడ్డాయి. నగదుకు సంబంధించిన ఆధారాలు లేనందున సీజ్ చేసినట్లు ఎస్సై అబ్దుల్‌రహీం తెలిపారు.

శివపార్వతుల కల్యాణానికి ముస్తాబు

● నేటి నుంచి ఐదు రోజుల పాటు వేడుకలు ● 28న స్వామి వారి కల్యాణం.. 30న రథోత్సవం



వేములవాడ ఆలయం



వేములవాడ ఆలయంలో కల్యాణం కోసం ఏర్పాట్లు

వేములవాడ, మార్చి 26 : వేములవాడ రాజరాజేశ్వర స్వామి క్షేత్రం శివకల్యాణోత్సవాలకు ముస్తాబవుతోంది. ఐదు రోజుల పాటు అత్యంత ఘనంగా జరిగే ఈ వేడుకల కోసం ఆలయ అధికారులు సిబ్బంది ఏర్పాట్లు చేస్తున్నారు. 27వ తేదీ బుధవారం నుంచి 31వ తేదీ ఆదివారం వరకు ఐదు రోజుల పాటు జరిగే ఉత్సవాలలో భాగంగా రెండవ రోజైన 28వ తేదీ గురువారం ఉదయం 10.50ని.ల నుంచి గం.12.55ల వరకు పార్వతీ రాజరాజేశ్వర స్వామివార్ల కల్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహిస్తారు. నాల్గవ రోజు 30వ తేదీ శనివారం సాయంత్రం గం.3.05ని.ల నుంచి స్వామివారి రథోత్సవం 31వ తేదీ ఆదివారం శివ కళ్యాణోత్సవాలు ముగుస్తాయి. రాజన్న క్షేత్రంలో అత్యంత ప్రతిష్టాత్మకమైన ఈ ఉత్సవాల కోసం ఆలయ అధికారులు పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటి వరకు ఆలయంలోని స్వామివారి కల్యాణ మండపంలో శివ కల్యాణం జరపడం ఆనవాయితీగా వస్తుండగా, ప్రతి ఏటా పెరుగుతున్న రద్దీని దృష్టిలో పెట్టుకొని ఈసారి ఆలయ చైర్మన్ చాంబర్ ముందు గల ఖాళీ స్థలంలో శివ కల్యాణం నిర్వహించాలని నిర్ణయించారు. ఈ మేరకు ఈ ప్రాంతంలో పందిళ్లు వేయడంతో పాటు అందమైన వేదికను ఏర్పాటు చేస్తున్నారు. ఉత్సవాలలో భాగంగా ఆలయ ఆవరణలో ప్రత్యేక పూజలు, హోమాల కోసం యాగశాల నిర్మించారు. ఆలయ గోపురాలను, ప్రాకారాలను రంగురంగుల విద్యుద్దీపాలతో అలంకరించారు.

ఈ సందర్భంగా దేవస్థానంలో ఈ నెల 27వ తేదీ నుంచి 31వ తేదీ వరకు ఐదు రోజుల పాటు పలు రకాల ఆర్జిత సేవలు నిలిపివేయనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. స్వామివారి నిత్యకల్యాణము, అభిషేకం, అన్నపూజ, లింగార్చన, సత్యనారాయణ స్వామి వ్రతము టికెట్లు సేవలను నిలిపివేస్తున్నట్లు వారు తెలిపారు. శివకళ్యాణోత్సవము సందర్భముగా 28వ తేదీ శుక్రవారం రోజున ఉదయం నుంచి మధ్యాహ్నం 3.00ల వరకు కోడె టికెట్లు జారీ నిలిపివేస్తా మని, నిత్య చండీ సహిత రుద్రహోమం టికెట్లు ఇవ్వనున్నట్లు వారు వెల్లడించారు.

భూ ఆక్రమణ కేసుల్లో పలువురి అరెస్టు

● వేర్వేరు కేసుల్లో జడ్పీటీసీ భర్త, కార్పొరేటర్ భర్త అరెస్టు ● అప్పటి తహసీల్దార్ సహా పలువురిపై కేసు



మాజీ సర్పంచ్ పిట్టల రవీందర్‌ను జైలుకు తరలిస్తున్న పోలీసులు



ఆకుల ప్రకాష్‌ను జైలుకు తరలిస్తున్న సీఐ ప్రదీప్‌కుమార్



మంద నగేష్, తిరుపతి విష్ణువర్ధన్‌లను జైలుకు తరలిస్తున్న పోలీసులు

కరీంనగర్ క్రైం, మార్చి 26: నకిలీ పత్రాలతో భూఆక్రమణకు పాల్పడిన కేసులో కొత్తపల్లి జడ్పీటీసీ భర్త, చింతకుంట మాజీ సర్పంచ్, కాంగ్రెస్ నాయకుడు పిట్టల రవీందర్‌ను కరీంనగర్ రూరల్ పోలీసులు మంగళవారం అరెస్టు చేసి కోర్టు ఆదేశాలతో 14 రోజుల రిమాండ్‌కు జైలుకు తరలించారు. కరీంనగర్ రూరల్ సీఐ ప్రదీప్ కుమార్‌కు వచ్చిన ఫిర్యాదు వివరాల ప్రకారం.. హైదరాబాద్ మాదాపూర్‌కు చెందిన పామ్‌రాజ్ గోవిందరావుకు 1954వ సంవత్సరం కాస్రా పహాణి ద్వారా చింతకుంట గ్రామ శివారు సర్వే నంబర్ 106లో ఐదు ఎకరాల 8 గుంటల భూమి ఉండేది. ఆ భూమిలో కుటుంబ సభ్యులు అందరూ అమ్ముకోగా 20 గుంటల భూమి మిగిలి ఉండేది. ఈ 20 గుంటల భూమి ధరణిలో తన తండ్రి పేరే ఉండేదని పామ్‌రాజ్ గోవిందరావు కుమారుడు పామ్‌రాజ్ దేవిదాస్‌రావు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. పహాణిలో మాత్రం పేరు టాంపర్ అయి అక్రమంగా న్యాలమడుగు చిన్న వీరయ్య పేరు వస్తున్నది. దీనిని గ్రహించిన అప్పటి సర్పంచ్ పిట్టల రవిందర్ ఆ భూమిని కాజేయాలని వీరయ్య పేరు గల మరో వ్యక్తి కొడుకు రాజయ్య పేరుపై అప్పటి తహసీల్దార్ మోహన్‌రెడ్డి ద్వారా కుమ్మక్కై తప్పుడు విరాసత్ ద్వారా ధ్రువపత్రాలు తయారు చేయించాడు. రాజయ్య నుంచి ముందుగానే నిర్ణయించుకున్న పథకం ప్రకారం గడ్డం ఆదిరెడ్డి పేరున 2009 సంవత్సరంలో రిజిస్ట్రేషన్ చేయించారు. 2010 సంవత్సరంలో ఆదిరెడ్డి నుంచి పిట్టల రవీందర్ పేరిట రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. తప్పుడు పత్రాలు అడ్డుపెట్టుకుని దానిని దౌర్జన్యంగా దున్నుతున్నాడని, అడ్డుగా వెళ్తే ఆ భూమి తనదేనని, ఇంకోసారి మీరు వస్తే చంపేస్తానని బెదిరింపులకు గురి చేస్తున్నాడని బాధితుడు పామ్‌రాజ్ దేవిదాస్‌రావు కరీంనగర్ రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు రూరల్ సీఐ ప్రదీప్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. విచారణలో బాధితుడు తెలిపిన వివరాలు నిజమేనని వెల్లడి కావడంతో నకిలీ ధ్రువ పత్రాలు సృష్టించి భూమిని కాజేయాలని ప్రయత్నించిన, దీనికి సహకరించిన అప్పటి తహసీల్దార్ మోహన్‌రెడ్డి, న్యాలమడుగు రాజయ్య, గడ్డం ఆదిరెడ్డిలపై కేసు నమోదు చేశారు. నిందితుడు పిట్టల రవీందర్‌ను అరెస్టు చేసి జైలుకు తరలించారు.

తప్పుడు పత్రాలతో ఒకే భూమిని పలువురికి విక్రయం

కరీంనగర్ క్రైం : తప్పుడు పత్రాలను సృష్టించి ఒకే భూమిని పలువురికి విక్రయించి, మోసం చేసి, బెదిరింపులకు గురిచేసిన ఘటనలో 7వ డివిజన్ కార్పొరేటర్ భర్త ఆకుల ప్రకాష్‌ను అరెస్టు చేసి జైలుకు తరలించామని కరీంనగర్ రూరల్ సీఐ ఏ ప్రదీప్ కుమార్ తెలిపారు. ప్రకాశ్‌తో పాటు మరో నలుగురిపై కేసు నమోదు చేశామన్నారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్ రూరల్ మండలం వల్లంపహాడ్ గ్రామంలో తొమ్మిద్రు నర్సింహారావు 1998లో సర్వే నంబర్ 159/ఎఫ్‌లో 10 గుంటలు, 161/ఎఫ్‌లో 9 గుంటలు. 162/ఎఫ్‌లో 14 గుంటలు మొత్తం 33 గుంటలు భూమిని కొనుగోలు చేసి ప్లాట్‌లుగా విభజించి పలువురికి విక్రయించాడు. ఇందులో తిమ్మాపూర్ మండలం మొగిలిపాలెంకు చెందిన వంతడపుల సంపత్ అనే వ్యక్తి తొమ్మిద్రు నర్సింహారావు వద్ద 1998లో ఒక ప్లాటును కొనుగోలు చేసాడు. ఇదిలా ఉండగా తొమ్మిద్రు నరసింహారావు పలువురికి విక్రయించిన భూమిని అక్రమంగా మళ్లీ తనపేరిటనే విక్రయ దస్తావేజు రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. ఆ భూమిని కరీంనగర్ గోదాంగడ్డకు చెందిన అబ్దుల్ హఫీజ్‌కు 33 గుంటలు గుత్తాగా విక్రయించగా, అబ్దుల్ హఫీజ్ అందులో నుంచి సర్వే నెంబర్ 159/ఎఫ్‌లో 10 గుంటల భూమిని కరీంనగర్ హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన 7వ డివిజన్ కార్పొరేటర్ భర్త ఆకుల ప్రకాష్ పేరిట రిజిస్ట్రేషన్ చేశాడు. తిరిగి ఆ భూమిలో నుంచి 3 గుంటలు భూమిని కట్టరాంపూర్‌కు చెందిన ఉప్పు సురేష్, వావిలాలపల్లికి చెందిన కట్ట రమ్యలు కావాలనే దురుద్దేశంతో తక్కువ ధరకు కొనుగోలుచేసి అసలు విక్రయదారులైన వారిని ఆ భూమిలోకి రానివ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తూ, బెదిరింపులకు పాల్పడుతున్నట్లు బాధితుడు వంతడుపుల సంపత్ కరీంనగర్ రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన సీఐ ప్రదీప్‌కుమార్ విచారణ చేపట్టారు. విచారణలో బాధితుడు వివరాలు నిజమేనని వెల్లడి కావటంతో నకిలీ ధ్రువపత్రాలు సృష్టించి భూమిని కాజేయాలని ప్రయత్నించిన, అతనికి సహకరించిన ఐదుగురు తొమ్మిద్రు నరసింహారావు, ఆకుల ప్రకాష్, మొహమ్మద్ అబ్దుల్ హఫీజ్, ఉప్పు సురేష్, కట్ట రమ్యలపై ఎస్సీఎస్టీ కింద కేసు నమోదు చేశారు. కార్పొరేటర్ భర్త ఆకుల ప్రకాష్‌ను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరచగా, నిందితుడికి 14 రోజుల రిమాండు విధించి జైలుకు తరలించారు.

తప్పుడు పత్రాలతో బెదిరించి 5 లక్షలు దోపిడీ - రౌడీషీటర్‌తో పాటు మరొకరి అరెస్టు

కరీంనగర్ క్రైం : తప్పుడు పత్రాలు సృష్టించి, మోసపూరితంగా వాటిని చూపి ఒక వ్యక్తిని బెదిరింపులకు గురిచేసి 5 లక్షల దోపిడీకి పాల్పడిన కేసులో రౌడీషీటర్ తిరుపతి విష్ణువర్ధన్, కాంగ్రెస్ నాయకుడు మంద నగేష్‌లను అరెస్టు చేసి జైలుకు తరలించామని కరీంనగర్ రూరల్ సీఐ ఏ ప్రదీప్‌కుమార్ తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. చొప్పదండి మండలం వెదురుగట్టు గ్రామానికి చెందిన పంబాల శ్రీనివాస్ తీగలగుట్టపల్లిలోని కార్తికేయ నగర్‌లో సర్వే నెంబర్ 233/ఇలో ప్లాట్ నెంబరు 120/ఏలో 200 చదరపు గజాల స్థలాన్ని గట్టు లక్ష్మి పేరిట కొనుగోలు చేశాడు. ఆ భూమికి తప్పుడు పత్రాలను చూపించి పంబాల శ్రీనివాస్‌ను రూ.20 లక్షలు డిమాండ్ చేశారు. 5 లక్షల రూపాయలు శ్రీనివాస్ వారికి ఇచ్చాడు. మరో 15లక్షలు కావాలని డిమాండ్ చేయడంతో పంబాల శ్రీనివాస్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టి బాధితుడు తెలిపిన వివరాలు నిజమేనని నిర్ధారించారు. రౌడీషీటర్ పద్మశాలివాడకు చెందిన తిరుపతి విష్ణువర్ధన్, కాపువాడకు చెందిన మంద నగేష్‌ను అరెస్టు చేసి మంగళవారం రాత్రి కోర్టు ఆదేశాల మేరకు 14 రోజుల రిమాండ్‌కు జైలుకు తరలించామని కరీంనగర్ రూరల్ సీఐ ఎ ప్రదీప్‌కుమార్ తెలిపారు. ఈ ఘటనలో తీగలగుట్టపల్లికి చెందిన మాజీ ఎంపీటీసీ కొమ్ము భూమయ్య, తిరుపతి నితిన్‌వర్ధన్‌లపై కేసు నమోదైనట్లు తెలిపారు.

ఎంపీ సంతోష్‌కుమార్, అతని సోదరి, బాబాయ్‌పై ఫిర్యాదు

బోయినపల్లి, మార్చి 26: శ్రీ రాజరాజేశ్వర జలాశయం నిర్మాణంలో భాగంగా ఎంపీ సంతోష్‌కుమార్, అతని సోదరి సౌమ్య, బాబాయ్ గంధ్రవెంకటరమణరావు అక్రమాలకు పాల్పడ్డారని రిటైర్డ్ సీఐ దాసరి భూమయ్య మంగళవారం బోయినపల్లి ఎస్‌ఐ పృథ్వీధర్‌గౌడ్‌కు ఫిర్యాదు చేశారు. మిడ్ మానేరు ప్రాజెక్ట్ నిర్మాణంలో భాగంగా కొదురుపాక గ్రామానికి చెందిన సంతోష్‌కుమార్ బీపీఎల్ కింద అర్‌అండ్ ఆర్ ప్యాకేజీ పరిహారం పొందారని, అతని సోదరి సౌమ్యకు వివాహం అయినప్పటికీ అక్రమంగా పట్టా పొందారని, అతని బాబాయ్ సిరిసిల్ల అర్బన్ పరిధిలోని పెద్దూర్ గ్రామానికి చెంది గంధ్ర వెంకటరమణారావు కూడా అక్రమంగా అర్‌అండ్ ఆర్ ప్యాకేజీ, పట్టా పొందారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అక్రమ పట్టాలు, అక్రమంగా ఆర్‌అండ్ ఆర్ ప్యాకేజీకి పొందిన వారిపై, సహకరించిన అధికారులపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

డ్రంకెన్‌డ్రైవ్ కేసులో ఏడుగురికి జైలుశిక్ష

కరీంనగర్ క్రైం, మార్చి 26 : డ్రంకెన్‌డ్రైవ్ కేసులో 20 మంది వాహనదారులను మంగళవారం కోర్టులో హాజరుపరచగా ఏడుగురు వ్యక్తులకు మూడు రోజుల జైలుశిక్షతో పాటు జరిమానా విధించినట్లు, మైనర్‌కు 3 వేల జరిమానా విధించినట్లు ట్రాఫిక్ సీఐ కరీం ఉల్లాఖాన్ తెలిపారు. ఏడుగురు వాహనదారులకు 3 రోజుల జైలుశిక్షతో పాటు మొత్తం 16 వేల రూపాయలు జరిమానా విధించారని, మరో 12 మందికి 17 వేల రూపాయలు జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు. నగరంలో ప్రతి రోజు డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. వాహనదారులు మద్యం సేవించి వాహనాలు నడపవద్దని, ప్రమాదాల బారినపడి కుటుంబ సభ్యులకు ఇబ్బందులు తలపెట్టవద్దని సూచించారు.

ఆటో డ్రైవర్‌పై కేసు నమోదు

జమ్మికుంట, మార్చి 26: అతివేగంతో అజాగ్రత్తగా ఆటో నడిపి బైక్‌ను ఢీకొట్టిన సంఘటనలో ఆటో డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు మంగళవారం పోలీస్‌లు తెలిపారు. జమ్మికుంటకు చెందిన సుంకిత భవాణి తన భర్తతో కలిసి బైక్‌పై కోరపల్లి వైపు వెళ్తున్నారు. అదే సమయంలో కోరపల్లి వైపు నుంచి అతివేగంగా వచ్చిన ఆటో గౌతమి హాస్టల్ ఎదుట బైక్‌ను ఢీకొట్టింది. ఈ సంఘటనలో ఇద్దరు గాయాలపాలయ్యారు. బాధిత మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆజాగ్రత్తగా నడిపిన ఆటో డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ వరంగంటి రవి తెలిపారు.

ఒకరిపై హత్యాయత్నం కేసు నమోదు

జమ్మికుంట, మార్చి 26: తన తల్లితో సహజీవనం చేస్తున్న ఓ వ్యక్తి తన భర్తను కులం పేరుతో దూషించి కత్తితో పొడిచాడని బాధితుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీస్‌లు మంగళవారం కేసు నమోదు చేశారు. పోలీస్‌లు తెలిపిన వివరాల ప్రకారం.. జమ్మికుంట పట్టణ పరిధిలోని హౌసింగ్‌బోర్డుకు చెందిన మానుపాటి పూజిత తల్లి పూలమ్మతో ఇల్లందకుంట మండలం సిరిసేడు గ్రామానికి చెందిన బొమ్మిడి రాజు కొంత కాలంగా సహజీవనం చేస్తున్నాడు. ఇటీవల అతిగా మద్యం తాగి వచ్చిన రాజు పూలమ్మను కొట్టడంతో పూజిత తను ఉంటున్న హౌసింగ్‌బోర్డుకు తల్లిని వెంట తీసుకు వచ్చింది. ఆగ్రహంతో ఊగిపోయిన రాజు అక్కడకు చేరుకుని పూజిత భర్త సురేష్‌ను కులం పేరుతో దూషించి వంట గదిలో ఉన్న కత్తితో పొడిచి హత్యాయత్నం చేశాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ వరంగంటి రవి తెలిపారు.

పంచాయతీ పెద్దలపై కేసు నమోదు

రామడుగు, మార్చి 26: పంచాయతీ పెద్దలుగా వ్యవహరిస్తూ ఒకరి సొమ్మును కాజేసిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సురేందర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని గోపాల్‌రావుపేట గ్రామానికి చెందిన గడ్డం వేణు తన భార్యతో విభేదాలు రావడంతో కోర్టు ద్వారా విడాకుల కోసం అంగీకారం కుదుర్చుకున్నాడు. ఈ అంగీకారంలో పంచాయతీ పెద్దలైన రాజు, మల్లేశంలు వేణు నుంచి రెండు లక్షలు తీసుకొని వారి మీద ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయించుకున్నారు. కాగా భార్యభర్తలకు కోర్టు ద్వారా విడాకుల మంజూరు పూర్తి కాకముందే ఆ ఇద్దరు పెద్ద మనుషులు వేణుకు తెలియకుండా బ్యాంకులో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయించుకున్న రూపాయలను విత్‌డ్రా చేసుకొని సొంతానికి వాడుకున్నారు. సదరు డబ్బులు తనకు ఇవ్వకుండా వేధిస్తూ మోసం చేస్తున్నారని వేణు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో ఆ ఇద్దరు పెద్ద మనుషులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

వివాహేతర సంబంధం ఘటనలో ఏఎస్‌ఐ సస్పెండ్

ఇబ్రహీంపట్నం, మార్చి 26: పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన ఫిర్యాదురాలితో వివాహేతర సంబంధం పెట్టుకున్న జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్ ఏఎస్‌ఐ రాములును సస్పెండ్ చేస్తూ మల్టీ జోన్1 ఐజి ఎ.వి. రంగనాథ్ ఉత్తర్వులు జారీ చేశారు. వివరాల్లోకి వెళితే.. ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ మహిళ తన భర్త రెండు సంవత్సరాలుగా వేధింపులకు గురి చేస్తున్నాడని తగిన చర్యలు తీసుకోవాలని ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఇదే పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహించిన ఏఎస్‌ఐ రామయ్య కేసు దర్యాప్తు చేస్తున్నట్లు బాధిత మహిళను నమ్మించి ఆమెతో పరిచయం పెంచుకున్నాడు. న్యాయం చేస్తానని బాధిత మహిళను నమ్మించాడు. మహిళ ఫోన్‌నంబర్ తీసుకుని ముచ్చటించడంతో పాటు అమెతో వివాహేతర సంబంధం కొనసాగించాడు.

ఈ విషయం సామాజిక మాధ్యమాల్లో ప్రచారం కావడంతో పోలీసు అధికారులు విచారణ చేపట్టారు. ఫిర్యాదు చేసేందుకు వచ్చిన మహిళతో వివాహేతర సంబంధాన్ని కొనసాగిస్తున్న ఏఎస్‌ఐ రామయ్యను సస్పెండ్ చేస్తున్నట్లు మల్టీజోన్-1 ఐజీ ఎ.వి.రంగనాథ్ వెల్లడించారు.

భార్య ఆత్మహత్యకు మరో మహిళ కారణమని హత్య

ధర్మపురి, మార్చి 26: ధర్మపురి మండలంలోని కమలాపూర్ గ్రామంలో మంగళవారం రాత్రి దారుణం చోటు చేసుకుంది. గ్రామంలో పులి రేణుక (40) అనే మహిళ ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఆ మహిళ ఆత్మహత్యకు కారణమనే అనుమానంతో పులి పద్మ (45) అనే మహిళను రేణుక భర్త పులి గంగన్న కల్లు గీసే ఉలితో పొడిచి హత్య చేశాడు. వివరాలు ఇలా ఉన్నాయి.

నాలుగేళ్ల నుంచి రేణుకకు పద్మకు గొడవలు జరుగుతున్నాయి. ఈ విషయమై పోలీస్ స్టేషన్‌లో పద్మ ఇటీవల ఫిర్యాదు చేసింది. ఇటీవల రేణుకను మంత్రాల నెపంతో పద్మ మానసికంగా ఇబ్బందులకు గురి చేసింది. దీంతో తీవ్ర మనోవేదనకు గురైన రేణుక మంగళవారం భర్త ఇంట్లో లేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. పని ముగించుకుని ఇంటికి చేరుకున్న భర్త గంగన్న ఇంట్లో ఆత్మహత్య చేసుకుని ఉన్న భార్యను చూసి షాక్‌కు గురయ్యాడు. తన భార్య మృతికి పద్మ కారణమనే అనుమానంతో ఆవేశానికి గురైన గంగన్న తన వద్ద ఉన్న కల్లు గీసే ఉలితో పద్మ ఇంట్లోకి వెళ్లి ఆమెను పొడిచి హత్య చేశాడు. ఈ ఘటన ధర్మపురి మండలం కమలాపూర్‌లో తీవ్ర విషాదం నింపింది.

మహిళ హత్యకేసులో నిందితుడి అరెస్టు

మల్యాల, మార్చి 26: ప్రేమించి పెళ్లి చేసుకున్న తనను కాదని విడాకులు తీసుకొని మరొకరిని వివాహం చేసుకోవడం జీర్ణించుకోలేని మొదటి భర్త వివాహితను హత్య చేసిన ఘటనలో నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. మల్యాల సీఐ నీలం రవి హత్య కేసు వివరాలను మంగళవారం మల్యాల పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. గొల్లపల్లి మండలం అగ్గిమల్లకు చెందిన కొల్లూరి నరేష్ జగిత్యాలలో వాటర్‌ప్లాంట్‌లో పని చేస్తుండగా జగిత్యాలకు చెందిన కరిపె అంజలితో 2018లో పరిచయం ఏర్పడింది. ఆ పరిచయం ప్రేమగా మారడంతో 2020లో వివాహం చేసుకున్నారు. సంతానం కలుగక పోవడం, మనస్పర్ధలతో తరచూ గొడవలు జరుగడంతో 2022లో ఇద్దరు విడాకులు తీసుకున్నారు. అయినప్పటికీ అంజలికి నరేష్ ఫోన్ చేస్తూ వేధించేవాడు. ఈ క్రమంలోనే అంజలికి యాదాద్రి జిల్లా గుండాల మండలం మాసంపల్లికి చెందిన వ్యక్తితో రెండవ వివాహం జరిగింది. రెండో పెళ్లి చేసుకొని తనను మోసం చేసిందని ఎలాగైని అంజలిని అంతమొందించాలని నిర్ణయించుకున్నాడు. ఇందులో భాగంగా నరేష్ మళ్లీ అంజలికి ఫోన్ చేసి మాయమాటలు చెప్పి జగిత్యాలకు రమ్మని చెప్పాడు. అంజలి కూడా తాను రాను అని తేల్చి చెప్పాలని అనుకొని ఈ నెల 17న జగిత్యాలకు రాగా అక్కడ ఇద్దరు కలుసుకున్నారు. తరువాత జగిత్యాలలో మద్యం కొనుగోలు చేసుకున్న నరేష్ మాట్లాడుకుందామని చెప్పి అంజలిని తన ద్విచక్రవాహనంపై ఎక్కించుకొని గొల్లపల్లి, రాయపట్నం మీదుగా మ్యాడంపల్లి శివారు వైపు తీసుకెళ్లాడు. ఎటు తీసుకెలుతున్నావని అంజలి అడుగడంతో ఆమెపై దాడి చేయడంతో పాటు గొంతు నులిమి హత్య చేశాడు. అనంతరం మృతదేహాన్ని సమీపంలో గల కాలువలో పడేసి వెళ్లాడు. చెప్పులు, చున్నీ, సెల్‌ఫోన్ సంచిలో వేసి పొదల్లో వేసి వెళ్లాడు. మరుసటి రోజు మృతదేహం సమాచారం తెలియడంతో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మృతురాలి తల్లి గుజ్జుల రజిత పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి మల్యాల సీఐ నీలం రవి ఆధ్వర్యంలో ఎస్సైలు అబ్దుల్ రహీం, కుమారస్వామి రెండు బృందాలుగా ఏర్పడి దర్యాప్తు చేపట్టారు. నరేష్ పోలీసులకు దొరకకూడదనే ఉద్దేశ్యంతో హైదరాబాద్ పారిపోతుండగా మంగళవారం కొండగట్టు వద్ద పోలీసుల వాహన తనిఖీల్లో పట్టు బడ్డాడు.

నరేష్ వద్ద రెండు సెల్‌ఫోన్లు, ద్విచక్రవాహనం సీజ్ చేసి కోర్టులో హాజరు పరిచినట్లు సీఐ పేర్కొన్నారు. అంజలి జగిత్యాలకు వచ్చే ముందు ఈ నెల 15న యాదాద్రి జిల్లా గుండాలలో అదృశ్యం కేసు నమోదు కాగా 17న మల్యాల మండలం మ్యాడంపల్లి శివారులో హత్యకు గురైనట్లు తేలింది.

నేటి నుంచి భక్త మార్కండేయ స్వామి ఆలయ వార్షికోత్సవాలు

ధర్మారం, మార్చి 26: మండల కేంద్రంలోని శ్రీభక్త మార్కండేయస్వామి దేవాలయంలో బుధవారం నుంచి ప్రథమ వార్షికోత్సవాలు జరగనున్నాయి. బుధవారం, గురువారం రెండు రోజులపాటు దేవాలయంలో ప్రత్యేక పూజలు, శివ కల్యాణం మహోత్సవాలు నిర్వహించనున్నట్టు ఆలయ నిర్వాహకులు తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని వారు కోరారు.

30న బొమ్మారెడ్డిపల్లిలో పౌరహక్కుల దినోత్సవం

ధర్మారం, మార్చి 26: మండలంలోని బొమ్మారెడ్డిపల్లిలో ఈనెల 30న పౌరహక్కుల దినోత్సవం నిర్వహించనున్నట్టు తహసీల్దార్ ఏ. రజిత ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అంటరానితనం నిర్మూలన, అత్యాచారాలు నిరోధించడంపై అవగాహన సదస్సు ఏర్పాటు చేసినట్టు పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు, కులసంఘాల నాయకులు పాల్గొనాలని కోరారు.

టెట్ ఫీజును తగ్గించాలి

కోల్‌సిటీటౌన్, మార్చి 26: రాష్ట్రంలో టీచర్ ఎలిజిబిలిటీ-2024కి సంబంధించిన ఫీజులను పెంచడం వల్ల నిరుపేద అభ్యర్థులకు అన్యాయం జరుగుతుందని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ బండి రాజశేఖర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వెంటనే పెంచిన ఫీజులను ప్రభుత్వం తగ్గించాలని కోరారు.

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన ఎస్సై

పాలకుర్తి, మార్చి 26: మండలంలో పలు పోలింగ్ కేంద్రాలను మంగళవారం బసంత్‌నగర్ ఎస్ఐ ఆర్ స్వామి పరిశీలించారు. అక్కడున్న వసతులను పరిశీలించారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిపేందుకు సహకరించాలన్నారు. సిబ్బందితో కలిసి పలు గ్రామాల్లో పర్యటించారు.

రైతులను నమ్మించి మోసం చేసిన కాంగ్రెస్

- ఎండిన పంటలకు నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలి - మాజీ మంత్రి, పెద్దపల్లి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్



ఎండిన వరిపంటను పరిశీలిస్తున్న మాజీ మంత్రి, జడ్పీ చైర్మన్

ముత్తారం, మార్చి 26 : అసెంబ్లీ ఎన్నికల సమయంలో ప్రతి ఎకరాకు సాగునీరు అందిస్తామని నమ్మించి మోసం చేసిన ఘనత కాంగ్రెస్ సర్కార్‌కే దక్కుతుందని మాజీ మంత్రి, పెద్దపల్లి పార్లమెంట్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ అన్నారు. మంగళవారం మండలంలోని సీతంపల్లి, రామకృష్టాపూర్ గ్రామాల్లో ఎండిన పంటలను జిల్లాపరిషత్ చైర్మన్ పుట్ట మధూకర్‌తో కలిసి ఆయన పరిశీలించారు. అనంతరం ఆయా గ్రామాల రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాసంగి పంటకు సాగునీరు ఇవ్వలేమని ముందుగానే కాంగ్రెస్ ప్రభుత్వం, పాలకులు ప్రకటిస్తే రైతులు పంటలు సాగు చేసి నష్టపోయే వారు కాదన్నారు. సాగునీరు అందిస్తామని చెప్పడంతో రైతులు పంటలు సాగు చేసుకున్నారని, ఈనాడు సాగునీరు ఇవ్వలేని దుస్థితిలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందన్నారు. ఆనాడు రైతుల కష్టాలను ఆలోచించి కాల్వలు తవ్వించి, ప్రాజెక్టులు నిర్మించి సాగు నీటి కష్టాలు తీర్చిన ఘనత మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. గత ఏడాది యాసంగి సమయంలో ప్రతి బోరు, ప్రతి చెరువు నిండుగానే ఉన్నాయని, రైతులకు పుష్కలమైన నీరు అందించామని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ నీళ్లు ఎక్కడికి పోయాయని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే మార్పు వస్తుందని గొప్పలు చెప్పారని, మార్పు అంటే పచ్చగా ఉండే పంటపొలాలను ఎండబెట్టడమేనా అని ఆయన విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన మూడు మాసాల్లో రాష్ట్ర వ్యాప్తంగా 138 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని, రైతుల ఆత్మహత్యల కోసమే తెలంగాణ సాధించుకున్నామా అని ఆయన ప్రశ్నించారు. సాగునీరు లేక ఎండిన పొలాలకు ప్రభుత్వం నష్టపరిహారం అందించాలని ఆయన డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా పరిషత్ చైర్మన్ పుట్ట మధూకర్ మాట్లాడుతూ కరెంటు, సాగునీరు లేక పంటలు ఎండిపోయిన రైతులు అధైర్యపడవద్దని, అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. పదేళ్ల క్రితం సమైక్యాంధ్ర పరిపాలనలో ఎలా ఉండేదో అవే పరిస్థితులు మళ్లీ కనిపిస్తున్నాయన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో అప్పటి నాయకులు ఇన్ని కష్టాలు పెట్టకపోయినా స్వరాష్ట్రంలో ఉన్న నాయకులు అధికారంలోకి వచ్చి తమను రోడ్లపైకి తీసుకువచ్చారన్నారు. ఓవైపు రాష్ట్రంలో సాగునీరు లేక పంటలు ఎండిపోయి రైతులు కన్నీరు పెట్టుకుంటుంటే ముఖ్యమంత్రి మాత్రం హోలీ సంబరాల్లో మునిగిపోయారని ఎద్దేవా చేశారు. రైతులు ఎన్ని కష్టాలు పడ్డా ఈ ప్రభుత్వానికి అవసరం లేదన్నారు. పంటలు ఎండిపోయి కష్టాల్లో ఉన్న రైతులను కలిసి ధైర్యం చెప్పాలని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాల మేరకు తాము ఎండిన పంటలను పరిశీలించి ధైర్యం చెబుతున్నామన్నారు. ఆయా గ్రామాల్లోని బీఆర్ఎస్ నాయకులు, రైతు నాయకులు ఎండిన పంటను అంచనా వేసి తమకు అందజేయాలని, బీఆర్ఎస్ పార్టీ పక్షాన కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ మెడలు వచ్చి రైతులకు నష్టపరిహారం అందించేలా పోరాటం చేస్తామన్నారు. నష్టపోయిన రైతులకు అండగా నిలుస్తామని, న్యాయం జరిగే వరకు పోరాడుతామని ఆయన స్పష్టం చేశారు.

రామగుండం ఎంఈవోగా రాజయ్య

కోల్‌సిటీటౌన్, మార్చి 26: రామగుండం మండల విద్యాధికారిగా ఎ.రాజయ్యను నియమిస్తూ జిల్లా విద్యాధికారి డి.మాధవి ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఉన్న ఎంఈవో పి.సంపత్‌రావు ఈనెల 31న ఉద్యోగ విరమణ పొందనున్నారు. ఆయన స్థానంలో రాజయ్యను నియమిస్తున్నట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. రామగుండం, పాలకుర్తి, అంతర్గాం మండలాలకు నూతన విద్యాధికారిగా రాజయ్య బాధ్యతలు చేపట్టనున్నారు.

మహనీయుల జయంత్యుత్సవాలు ఘనంగా నిర్వహించాలి



మేయర్‌కు వినతిపత్రం ఇస్తున్న దళిత సంఘాల నాయకులు

కోల్‌సిటీటౌన్, మార్చి26: మహనీయుల జయంత్యుత్సవాలను రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించాలని ఆలిండియా అంబేద్కర్ యువజన సంఘం కోరింది. ఈమేరకు మంగళవారం రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో మేయర్ బంగి అనిల్‌కుమార్‌కు దళిత సంఘాల నాయకులు వినతిపత్రం అందజేశారు. ఏప్రిల్ 5న బాబుజగ్జీవన్‌రామ్, 11న మహాత్మా జ్యోతిరావుపూలే, 14న రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ జయంతి కార్యక్రమాలను కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించాలన్నారు. రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్‌ఠాకూర్ జయంత్యుత్సవాల నిర్వహణకు చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈకార్యక్రమంలో బొంకూరి మధు, కె.లక్ష్మణ్, కాంపెల్లి సతీష్, పులిమోహన్, మంతెన లింగయ్య, శనిగరపు రామస్వామి, కిష్టయ్య, శశిభూషన్, పంజా అశోక్, నర్సింగరావు, కె.సమ్మయ్య, రాజేశం పాల్గొన్నారు.

సాగునీరు విడుదల చేయాలని రైతుల రాస్తారోకో



రాస్తారోకో చేస్తున్న రైతులు

మంథని, మార్చి 26: ఎస్ఆర్ఎస్పీ కాలువ ద్వారా సాగునీటిని ప్రభుత్వం విడుదల చేసి తమ పంటలను కాపాడాలని డిమాండ్ చేస్తూ మంథని-గోదావరిఖని ప్రధాన రహదారిపై రైతులు మంగళవారం రాస్తారోకో నిర్వహించారు. మంథని పట్టణంలోని పోచమ్మవాడ, మండలంలోని మల్లెపల్లి గ్రామానికి చెందిన రైతులు వైజంక్షన్ వద్ద ఆందోళనకు దిగారు. వేలాది రూపాయల పెట్టుబడులు పెట్టి పంటల సాగుచేస్తే పంటలు పొట్ట దశకు వచ్చిన తరుణంలో కాలువల ద్వారా సకాలంలో సాగు నీరు అందించకుంటే తమకు ఆత్మహత్యలే శరణ్యమని రైతులు వాపోయారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా రైతులు నినాదాలు చేశారు. గతంలో రైతులకు సరిపడా సాగునీరు వచ్చిందని, ఇప్పుడు పంటలు ఎండిపోయే కాలం వచ్చిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు, ప్రభుత్వం రైతులను పట్టించుకొని పంటకు సాగునీరు ఇచ్చి పంటలను రక్షించాలని కోరారు. దాదాపు గంటపాటు రోడ్డుపై రైతులు రాస్తారోకో నిర్వహించడంతో భారీ ఎత్తున ట్రాఫిక్ నిలిచిపోయింది. ధర్నా చేస్తున్న రైతులను పోలీసులు ధర్నా విరమించాలని కోరినా వారు ససేమీరా అనడంతో ఇరిగేషన్ అధికారి అక్కడకు చేరుకొని రైతులతో మాట్లాడారు. పంటలను కాపాడటానికి సాగునీరు అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు. మంథని సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ వెంకటకృష్ణ ఆధ్వర్యంలో పోలీసులు ట్రాఫిక్ క్లియర్ చేశారు.

పేద యువతి పెళ్లికి సహాయం

కాల్వశ్రీరాంపూర్, మార్చి 26: మండలంలోని మడిపల్లి గ్రామంలో నివాసముంటున్న పేద కుటుంబానికి చెందిన సూత్రాల అరుణ-వీరయ్య కూతురు అమూల్య వివాహానికి ఏగోలపు కుమార్‌గౌడ్ చారిటబుల్ ట్రస్టు అధ్యక్షుడు ఏగోలపు సదయ్యగౌడ్ బియ్యం, పెళ్లి కూతురు అమూల్యకు చీర మంగళవారం అందచేశారు. కార్యక్రమంలో సిరిసెట్టి సాయిగౌడ్, కట్కూరి మల్లయ్య, గాజుల లక్ష్మీనారి, సిరిసెట్టి ఐలయ్యగౌడ్, తూడు మల్లేష్, సూత్రాల శ్రీనివాస్, ప్రశాంత్, లక్ష్మీనారాయణ, కల్లెపల్లి రాజు, కుమార్, మాటూరి అజయ్ తదితరులు పాల్గొన్నారు.

గోదావరి వంతెనపై నుంచి దూకేందుకు యత్నించిన యువకుడు

ఫెటింక్లయిన్‌కాలనీ, మార్చి 26: గోదావరిఖని గోదావరి వంతెనపై నుంచి ఓ యువకుడు నదిలోకి దూకేందుకు ప్రయత్నించగా పోలీసులు అతన్ని అడ్డుకున్నారు. కమాన్‌పూర్ మండలం పేరపల్లికి చెందిన అనిల్ కుటుంబ కలహాలతో మంగళవారం రాత్రి గోదావరి వంతెన నుంచి నదిలో దూకేందుకు ప్రయత్నించగా విధుల్లో ఉన్న కానిస్టేబుళ్లు జంపయ్య, పూర్ణ చందర్‌లు గమనించి నదిలో దూకకుండా అడ్డుకుని అతన్ని రక్షించారు. అనీల్ మద్యం మత్తులో ఉన్నట్టు పోలీసులు తెలిపారు.

ఉపాధి కూలీలకు కనీస సౌకర్యాలు కల్పించాలి

భగత్‌నగర్, మార్చి 26: ఉపాధిహామీ పని ప్రదేశాల్లో కనీస సౌకర్యాలు కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి కొయ్యడ సృజన్‌కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉపాధిహామీ పనులు విస్తృతంగా జరుగుతున్న సందర్భంగా వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని పని ప్రదేశాల్లో కూలీలకు మంచినీటి సౌకర్యం, నీడ సౌకర్యం కల్పించడంతో పాటు ఓఆర్ఎస్ ప్యాకెట్స్ పంపిణీ చేయాలన్నారు. కూలీల పనులను ఉదయం 7 గంటల నుంచి 11 గంటల వరకు మాత్రమే కొనసాగించాలన్నారు. ఉపాధిహామీ కూలీలు శ్రమ దోపిడీకి గురవుతున్నారని, కొలతలు లేకుండా పనులు కల్పించి కూలీలను ఆర్థికంగా ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

విద్యార్థులు నైపుణ్యాలను మెరుగుపరచుకోవాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ శ్రీనివాస్

పెద్దపల్లి రూరల్, మార్చి 26: మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రతి విద్యార్థి టెక్నాలజీ అనుగుణంగా నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని మదర్ థెరిస్సా ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ టి.శ్రీనివాస్ అన్నారు. ప్రోగ్రామింగ్ ఎసెన్షియల్ ఇన్ పైతాన్, జాంగో అనే అంశంపై మండలంలోని పెద్దబొంకూర్‌లోని మదర్ థెరిస్సా ఇంజనీరింగ్ కళాశాలలో మూడు రోజుల వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టాస్క్ రిసోర్స్‌పర్సన్ రత్నప్రియ హాజరై విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ఈకార్యక్రమంలో కళాశాల చైర్మన్ ఎడవెల్లి నవీన్, డైరెక్టర్ నవత, అకౌంట్స్ ఆఫీసర్ పవన్‌కుమార్, ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ అధికారి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సంస్మరణ సభ

ఓదెల, మార్చి 26: మండల కేంద్రానికి చెందిన నేత్రదాత ముద్దసాని వెంకట సాయి ఇటీవల మృతి చెందగా మంగళవారం సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సంస్మరణ సభ నిర్వహించారు. అనంతరం ఫౌండేషన్ జాతీయ అధ్యక్షుడు టి.శ్రవణ్ కుమార్, కార్యదర్శి మేర్గు భీష్మచారి నేత్ర, అవయ, శరీర దానాలపై అవగాహన కల్పించారు. తహసీల్దార్ యాకయ్య జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో ఆర్ఐ రాజేందర్, రమేష్, సరిత, బోడకుంట చిన్నస్వామి, డాక్టర్ దాసరి రాజన్న, అల్లం సతీష్ తదితరులు పాల్గొన్నారు.

రేపు ఉచిత కంటి వైద్య శిబిరం

మంథని, మార్చి 26: ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగస్థుల సంఘం ఆధ్వర్యంలో గురువారం మంథనిలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశామని సంఘం అధ్యక్షుడు మారుపాక సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి తనుగుల విజయ్‌కుమార్, ఆర్థిక కార్యదర్శి కొమురోజు శ్రీనివాస్‌లు మంగళవారం తెలిపారు. స్థానిక నడివీధిలోని గజానన మండలిలో హైదరాబాద్‌కు చెందిన మెడివిజన్ కంటి ఆసుపత్రి వారిచే ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశామన్నారు. వైద్య పరీక్షలు చేయించుకునే వారు తమ హెల్త్ కార్డులు తీసుకుని రావాలని వారు సూచించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, విశ్రాంత, సింగరేణి, ఆర్టీసీ ఉద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా చర్యలు

- జిల్లా కోఆపరేటివ్ అధికారి శ్రీమాల



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీమాల

పెద్దపల్లి రూరల్, మార్చి 26 : వేసవి కాలం దృష్ట్యా గ్రామాల్లో ప్రజలకు తాగు నీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కోఆపరేటివ్ అధికారి శ్రీమాల అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో గ్రామ పంచాయతీ కార్యదర్శులు, ప్రత్యేకాధికారులతో నీటి ఎద్దడిపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లా కోఆపరేటివ్ అధికారి శ్రీమాల మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీటి సమస్య ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. అలాగే మిషన్ భగీరథ నీటి సరఫరా ఏవైనా సమస్యలు ఉండి నిలిపివేస్తే ప్రత్నామ్యాయం ఉంటే విధంగా పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. మిషన్ భగీరథ నీటి సరఫరా విషయంలో సమస్యలు తలెత్తితే వెంటనే సంబంధిత శాఖ అధికారులకు సమాచారం అందించాలని, సమస్యల పరిష్కారం చేసే విధంగా గ్రామ అధికారులు ముందుండాలన్నారు.

ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్, మిషన్ భగీరథ అధికారులు, ఎంపీవో సుదర్శన్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

జోరుగా గుడుంబా, బెల్లం రవాణా

- పట్టించుకోని అధికారులు

కాల్వశ్రీరాంపూర్, మార్చి 26: గుడుంబాకు తయారీకి ఉపయోగించే బెల్లం అక్రమ రవాణా మండలంలో జోరుగా సాగుతోంది. కాల్వశ్రీరాంపూర్, పెగడపల్లి, గంగారం తదితర గ్రామాల నుంచి అక్రమంగా రావాణా జరుగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. గుడుంబాకు ఉపయోగించే బెల్లం, ఇతర ముడిసరుకు ఆటోల ద్వారా రాత్రి సమయాల్లో గుడుంబా తయారు చేసే స్థావరాలకు తరలిస్తున్నారు. మండలంలోని ఏ గ్రామంలో చూసినా గుడంబా ప్యాకెట్లు దర్శనమిస్తున్నాయి. గ్రామాల్లో విచ్చలవిడిగా దొరికే గుడుంబాకు పెద్దలతోపాటు యువకులు కూడా అలవాటు పడుతున్నారు. సంబంధిత ఎక్సైజ్ అధికారులు, గుడుంబా తయారుచేసే వారిపై దాడులు నిర్వహిస్తున్నా, అందుకు ఉపయోగించే బెల్లం, ముడిసరుకుల రవాణాను అడ్డుకోవాలని గ్రామస్థులు అభిప్రాయ పడుతున్నారు. కూలీ పని చేసే కుటుంబాలు ఎక్కువగా గుడుంబాకు అలవాటుపడుతున్నారు. ఎక్సైజ్ అధికారులు ఎన్నోసార్లు గుడుంబా అమ్మేవారిపై దాడులు నిర్వహించినా వారు మానడంలేదు. గతంలో కాల్వశ్రీరాంపూర్, పెగడపల్లిలో పోలీసులు గుడుంబాకు ఉపయోగించే బెల్లం, ఇతర ముడి సరుకులు అమ్మేవారిని పట్టుకుని హెచ్చరించిన సంఘటనలున్నాయి. గుడుంబా తయారీకి ఉపయోగించే బెల్లం, ముడిసరుకు అమ్మడం వల్ల అధిక లాభాలు ఉండడంతో గ్రామాల్లో కొందరు వ్యాపారులు అక్రమంగా ఈ వ్యాపారం చేస్తున్నట్టు సమాచారం. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి గుడుంబా తయారీకి ఉపయోగించే బెల్లం, ముడిసరుకు అమ్మేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పెద్దపల్లి కాంగ్రెస్ అభ్యర్థి ఎంపికపై పునరాలోచించాలి

- యువజన కాంగ్రెస్ జాతీయ మాజీ కార్యదర్శి వరప్రసాద్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వరప్రసాద్

సుల్తానాబాద్, మార్చి 26: పెద్దపల్లి పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఎంపిక విషయంలో పార్టీపెద్దలు పునరాలోచించాలని యువజన కాంగ్రెస్ జాతీయ మాజీ ప్రదాన కార్యదర్శి ఊట్ల వరప్రసాద్ అన్నారు. సుల్తానాబాద్‌లోని వైశ్యభవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన తన మద్దతుదారులతో కలిసి మాట్లాడుతూ రాజకీయాలంటే ఏమాత్రం అవగాహన లేనివారికి, కేవలం మూడు నెలల ముందు పార్టీలో వచ్చిన వారికి చెన్నూర్‌లో టికెట్, ఆయన సోదరునికి మరో టికెట్, ఇపుడు కొడుకుకు ఎంపీ టికెట్ ఇచ్చారని, ఒక కుటుంబం మెప్పు కోసం కార్యకర్తలను అవమానించే నిర్ణయం తీసుకున్నారన్నారు. వెంకటస్వామి కుటుంబానికి మూడు టికెట్లు ఇవ్వడం ఏంటని ప్రశ్నించారు. కేసీఆర్ కుటుంబ పాలనను వ్యతిరేకిస్తూ ప్రజా మద్దతు కూడగట్టి వారిని గద్దె దించితే కాంగ్రెస్ పార్టీలో కూడా ఇదే కుటుంబ పాలనను ప్రోత్సహించడం ఎంతవరకు సబబని అన్నారు. తన వ్యాపారాలను, ఆస్తులను కాపాడుకోవడానికి మాత్రమే రాజకీయాలను నడుపుతూ ప్రతి ఎన్నికల ముందు గడ్డం వివేక్ టికెట్‌ను తన్నుకునిపోతూ పార్టీని నమ్ముకుని దశాబ్దాలుగా జీవితాన్ని త్యాగం చేసుకునే తనలాంటి నాయకులకు అన్యాయం చేస్తున్నారని, ఇక తమకు ఎప్పుడు అవకాశం కల్పిస్తారని ప్రశ్నించారు. నాలుగు దశాబ్దాల నుంచి ఒకే కుటుంబానికి, ఎప్పుడు పార్టీకీ విధేయులుగా ఉండని వారికి టికెట్ కేటాయిస్తూ పోతే ఇదే నియోజకవర్గంలో పార్టీని నమ్ముకుని అంచెలంచెలుగా వివిధ హోదాల్లో పని చేస్తూ టికెట్ ఆశించే తనలాంటి వారి పరిస్థితి ఏంటన్నారు. తనలాంటి నాయకులే వెంకటస్వామి అసలు సిసలు వారసులని, పూటకో పార్టీ మారే వివేక్‌లాంటి వ్యక్తులు కారన్నారు. ఇప్పటికైనా తనలాంటి కార్యకర్తలకు టికెట్ ఇవ్వాలని లేకుంటే ఏప్రిల్ 5న జిల్లా కేంద్రంలో న్యాయపోరాట దీక్ష చేపడుతానని ప్రకటించారు.

ఏఐసీసీ అధ్యక్షుడిని కలిసిన పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి వంశీకృష్ణ



ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో గడ్డం వంశీకృష్ణ, ఎమ్మెల్యేలు

పెద్దపల్లి, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను పెద్దపల్లి పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ మంగళవారం ఉదయం ఢిల్లీలో మర్యాద పూర్వకంగా బెల్లంపల్లి, చెన్నూర్ ఎమ్మెల్యేలు గడ్డం వినోద్, గడ్డం వివేక్‌తో కలిసి కలిశారు. ఈ సందర్భంగా పెద్దపల్లి నుంచి తప్పకుండా గెలుపొందుతానని, కాంగ్రెస్ పార్టీకే విజయావకాశాలు ఉన్నాయని ఖర్గేకు వంశీకృష్ణ వివరించారు.



సీఎంపీఎఫ్ తప్పుడు లెక్కలను సరిచేయాలి

ఫెటింక్లయిన్‌కాలనీ, మార్చి 26: సింగరేణి కాంట్రాక్టు కార్మికుల సీఎంపీఎఫ్ లెక్కింపులో దొర్లిన తప్పిదాలను సరిచేయాలని కోరుతూ ఇఫ్టూ నాయకులు మంగళవారం ఆర్జీ-2 యాజమాన్యానికి వినతిపత్రాన్ని అందజేశారు. సింగరేణి కాలరీస్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ ఉపాధ్యక్షుడు బీ అశోక్ మాట్లాడారు. 2018 నుంచి ఆర్జీ-2 ఏరియాకు చెందిన కాంట్రాక్టు కార్మికులకు ఇచ్చిన సీఎంపీఎఫ్ చిట్టీల్లో తప్పులు దొర్లినట్టు పేర్కొన్నారు. తప్పుడు లెక్కలు అందించడంపై గతంలో వినతిపత్రాలు ఇచ్చినా ఇప్పటి వరకు సరిచేయలేదని అన్నారు. ఎవరికి వారు సీఎంపీఎఫ్ ఆఫీస్‌కు వెళ్లి అక్కడే సరిచేసుకోవాలని కొందరు అధికారులు నిర్లక్ష్యంగా సమాధానం ఇవ్వడం సరికాదన్నారు. వాస్తవంగా ఎంత సీఎంపీఎఫ్ రివకరీ జరిగిందనే విషయంలో కార్మికులు గందరగోళానికి గురవుతున్నారని, వాటిని సరిచేసి సీఎంపీఎఫ్ చిట్టీలు ఇవ్వాలని అశోక్ డిమాండ్ చేశారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో కాంట్రాక్టు కార్మికులు బుచ్చమ్మ, తిరుపతి, రాయమల్లు, లక్ష్మి, రమా, స్వరూప, శారద ఉన్నారు.

వైద్య సిబ్బందిని నియమించాలి

- బీఎంఎస్ ఏరియా కార్యదర్శి నాతాడి శ్రీధర్‌రెడ్డి

శ్రీరాంపూర్, మార్చి 26: శ్రీరాంపూర్ ఏరియాలోని సింగరేణి డిస్పెన్సరీలలో తగినంత మంది వైద్యులు, వైద్య సిబ్బందిని నియమించాలని సింగరేణి కోల్ మైన్స్ కార్మిక సంఘ్(బీఎంఎస్) ఏరియా కార్యదర్శి నాతాడి శ్రీధర్ రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కార్మికులు, కార్మిక కుటుంబాలకు సరిపోయినంత మంది వైద్యులు, సిబ్బంది లేరని తెలిపారు. స్పెషలిస్టు డాక్టర్లు లేక కార్పొరేట్ ఆస్పత్రులకు రిఫర్ చేస్తున్నారని పేర్కొన్నారు. సింగరేణిలో నేడు ఎక్కువ మంది యువ కార్మికులు పనిచేస్తున్నారని, వారి కుటుంబాలకు గైనకాల జిస్టులు, పిల్లల వైద్యులు అవసరమని తెలిపారు. కాగా తగిన వైద్య సేవలు అందకపోవడంతో ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయించాల్సి వస్తోందని పేర్కొన్నారు. రామకృష్ణాపూర్ ఏరియా ఆస్పత్రిలో సీటీ స్కాన్, అన్ని రకాల స్పెషలిస్టు వైద్యులను నియమించాలని ఆయన కోరారు.

నేతకాని సమాజంపై 'గుమ్మడి' వ్యాఖ్యలు సరికాదు

- జాతీయ స్టీరింగ్ కమిటీ చైర్మన్ బండారి కనకయ్య



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బండారి కనకయ్య

కళ్యాణ్‌నగర్, మార్చి 26: నేతకాని మహర్ సామాజికవర్గంపై కాంగ్రెస్ సీనియర్ నాయకుడు గుమ్మడి కుమారస్వామి చేసిన వ్యాఖ్యలు సరికావని నేతకాని సామాజిక వర్గం జాతీయ స్టీరింగ్ కమిటీ చైర్మన్ బండారి కనకయ్య అన్నారు. మంగళవారం గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నేతకానిలను విమర్శిస్తూ వ్యాఖ్యలు చేశారని, దీనిపై గుమ్మడి కుమారస్వామి క్షమాపణలు చెప్పాలన్నారు. పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలో 2.5లక్షల మంది నేతకానిలు ఉన్నారని, తాము ఏరోజు కూడా మాల, మాదిగలను విమర్శించలేదన్నారు. గుమ్మడి కుమారస్వామి చరిత్ర ప్రజలందరికి తెలుసునని, గతంలో కాకా కుటుంబాన్ని విమర్శించిన గుమ్మడి ఇప్పుడు చిలుక పలుకులు పలుకుతున్నారన్నారు. నేతకాని మహర్ ఆంధ్ర, మహారాష్ట్ర, ఒడిస్సా, గుజరాత్, చత్తీస్‌ఘడ్ రాష్ట్రాల్లో ఉన్నారని, పోడు భూముల కోసం గిరిజనులతో కలిసి నేతకానిలు కూడా పోరాటం చేస్తున్నారని ఆయన చెప్పారు. తాము ఏ పార్టీకి రాజకీయంగా అనుబంధంగా లేమని, కానీ తమ నేతకాని సమాజంపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. ఈ విలేకరుల సమావేశంలో నేతకాని మహర్ నాయకులు రాయమల్లు, దుర్గం రాజేష్, ఎల్లయ్య, జువ్వాజి తిరుపతి, రాయమల్లు, నర్సయ్య, ప్రభాకర్, రాజన్న, నగేష్, రాజయ్య, శ్రీనివాస్,పద్మ, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

'దళితుల మధ్య చిచ్చు పెట్టేందుకు కుట్ర'

కళ్యాణ్‌నగర్, మార్చి 26: దళితుల మధ్య చిచ్చు పెట్టేందుకు కొంత మంది కుట్రలు చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గుమ్మడి కుమారస్వామి ఒక ప్రకటనలో తెలిపారు. తాను నేతకాని ఉప కులాలను ఉద్దేశించి తప్పుగా మాట్లాడినట్టు ప్రచారం చేయడం బాధాకరమన్నారు. బీజేపీ అభ్యర్థి గోమాసే శ్రీనివాస్ వెంకటస్వామి కుటుంబంపై విద్వేషపూరితంగా మాట్లాడడాన్ని తప్పు బట్టామన్నారు. రాజకీయాల కతీతంగా దళిత శక్తులు, కులాలు ఐక్యం కావాలని ఆయన పిలుపునిచ్చారు.



సమావేశంలో మాట్లాడుతున్న సింగిల్ విండో చైర్మన్ భాస్కరరావు

రైతులకు రుణాలు అందజేస్తాం..

కమాన్‌పూర్, మార్చి 26: కమాన్‌పూర్ వ్యవసాయ సహకార సంఘం ద్వారా రైతులకు దీర్ఘకాలిక, స్వల్పకాలిక రుణాలు అందజేస్తామని వ్యవసాయ సహకార పరపతి సంఘం చైర్మన్ ఇనగంటి భాస్కరరావు అన్నారు. మంగళవారం కమాన్‌పూర్ కార్యాలయంలో కార్యదర్శి తిమ్మరాజు సంతోష్‌కుమార్ ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా చైర్మన్ భాస్కరరావు మాట్లాడుతూ ఏప్రిల్ నుంచి రైతులకు రూ.3కోట్ల స్వల్పకాలిక, రూ.5కోట్ల దీర్ఘకాలిక రుణాలు ఇస్తామన్నారు. వ్యవసాయ సహకార సంఘం పరిధిలోని 11 కేంద్రాల్లో ఈ రబీ సీజన్‌లో వరి కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తామన్నారు. ఈ సమావేశంలో సంఘ వైస్ చైర్మన్ చిందం తిరుపతి, సభ్యులు పైనాల రాజు, వరాల నరసింగం, అడువాల చంద్రయ్య, జనగామ తార, సైన్ల సత్యనారాయణ, బానోతు లక్ష్మి, పూదరి నరేష్ భోగి లింగయ్య పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వినియోగంపై మున్సిపల్ అధికారుల కొరడా



షాపులో నుంచి ప్లాస్టిక్ కవర్లను స్వాధీనం చేసుకుంటున్న అధికారులు

కోల్‌సిటీ, మార్చి 26: రామగుండం నగరపాలక సంస్థలో ప్లాస్టిక్ వినియోగంపై వివిధ చోట్ల శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్యాంసుందర్ ఆధ్వర్యంలో మంగళవారం దుకాణాలు, హోటళ్లు, కర్రీపాయింట్, హలీమ్ కేంద్రాలు, స్వీట్ హౌస్‌లపై కొరడా ఝుళిపించారు. గోదావరిఖని చౌరస్తా, ప్రధాన రోడ్ల వెంట, ఎన్‌టీపీసీ, రామగుండం ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ మధుకర్ ఉన్నారు.